క్లుప్తంగా

మద్దిలేటిస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ పరిసరాలు

బేతంచెర్ల: ఆషాడ మాసం శనివారం సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ సేవల ద్వారా రూ.1,29,965 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



డోన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాసరావు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రీడాకారునికి నగదు ప్రోత్సాహం



చెక్కు అందజేస్తున్న యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: జాతీయ స్థాయిలో రాణిస్తున్న యువ క్రీడాకారులకు రామ్‌కో సిమెంట్ కంపెనీ ప్రోత్సాహం అందిస్తుందని కంపెనీ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు తెలిపారు. శనివారం నంద్యాల పట్టణానికి చెందిన జంప్‌రోప్ క్రీడాకారుడు రుణిక్ నగేష్‌కు కల్వటాల సమీపంలోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగేష్ ఇప్పటికే జాతీయ స్థాయిలో ఐదు మెడల్స్ గెలుచుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఆర్ జీఎం రవికుమార్, సీఎస్‌ఆర్ మేనేజర్ అఖిల్ పాల్గొన్నారు.

పక్షుల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి పక్షుల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..విద్యార్థులు ఈ కోర్సు చేయడం వల్ల అదనపు ప్రయోజనాలు ఉంటాయని, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు పక్షుల సంరక్షణకు మార్గాలు అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, కృష్ణదాసు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు దగ్గు, జలుబు, సాధారణ జ్వరం, తదితర వాటికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అస్కారం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, వైద్యులు సృజన, రాబర్ట్ కెన్నెడి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు నరసింహులు, తిరుపతయ్య, తిరుపాలు పాల్గొన్నారు.



అద్దె భవనంలో ఉన్న మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం



పాల శీతలీకరణ కేంద్రం

అద్దె భవనాలే దిక్కు

- ఏటా అద్దెలకే లక్షల రూపాయలు చెల్లింపు
- గత ప్రభుత్వంలో 90 శాతం ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- మిగిలిన కార్యాలయాలపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం

డోన్: నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై ఆర్థికంగా భారం పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాధాన్యత క్రమంలో 90 శాతం ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. మరో 10 శాతం కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేలోగా అధికారం చేతులు మారడంతో వీటి ప్రతిపాదనలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. పట్టణంలో తూనికల కొలతల శాఖ, మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం, పాల శీతల కేంద్రం, మైనర్ ఇరిగేషన్ కార్యాలయం, కోఆపరేటివ్ సొసైటీ, ఉద్యానవన శాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏటా లక్షలాది రూపాయలను ఇంటి యజమానులకు అద్దె రూపంలో ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. హౌసింగ్, వ్యవసాయ, భూసార సంరక్షణ, నీటి పరీక్ష కేంద్రం కార్యాలయాలు పురాతన భవనాల్లో నిర్వహిస్తున్నందున ఉద్యోగులు అభద్రతా భావంతో పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ కార్యాలయాలన్నింటికీ నూతన భవనాలను నిర్మించి



తూనికల కొలతల శాఖ కార్యాలయం

లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాకాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పరామర్శ

ప్యాపిలి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డిని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం పరామర్శించారు. వెంకటేశ్వర్ రెడ్డి కుమారుడు ధీరజ్‌రెడ్డి గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. పుత్రశోకంలో ఉన్న వెంకటేశ్వర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు.



వెంకటేశ్వర్ రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సమస్యలపై వీఆర్‌ఏల వినతి

బనగానపల్లె రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)కు నైట్ డ్యూటీలను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జేవీ సుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఏలకు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలోనూ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ప్రత్యేక అలవెన్స్‌లు, అర్హులకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. పట్టణంలోని పెట్రోల్ బంక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వీఆర్‌ఏల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేష్, మండల అధ్యక్షుడు బాలుడు, కార్యదర్శి గౌస్‌పీరా తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం



ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలకు పూర్వ ఉపాధ్యాయుడు సీహెచ్ రంగారావు జ్ఞాపకార్థం కుమార్తె గాయత్రి, కుటుంబ సభ్యులు శనివారం రూ.20 వేల విలువగల మైక్ సెట్, రూ.10 వేలు విలువైన గోడ గడియారాన్ని విరాళంగా ఇచ్చారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు హుసేనాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి రూ. 2 వేలు చొప్పున, గ్రామ పెద్ద లక్ష్మీనారాయణ గౌడ్ ముగ్గురు విద్యార్థులకు కలిపి రూ. 5 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. హెచ్‌ఎం అన్వర్ బాషా, ఉపాధ్యాయులు చంద్రమౌళి, అంజనప్ప పాల్గొన్నారు. హుసేనాపురం పూర్వ విద్యార్థుల సంఘం (హోసా) ఆధ్వర్యంలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లిఖిల్, హసీనా, కళ్యాణ్ రామ్‌కు రెండు తులాల వెండి మెడల్, డిక్షనరీలు అందజేశారు.

గొర్రె పిల్లలపై కుక్కల దాడి

- 70 గొర్రె పిల్లలు మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లెలో శనివారం కుక్కల దాడిలో 70 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గొల్ల చిన్న రాయుడు రోజు మాదిరిగానే మేత కోసం గొర్రెలను కొండకు తోలుకెళ్లే సమయంలో గొర్రె పిల్లలను గూటిలో ఉంచి వెళ్లిపోయాడు. కుక్కలు గూటిలోకి చేరుకుని గొర్రె పిల్లలపై ఇష్టానుసారంగా దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి. కొండ నుంచి గూటి వద్దకు వచ్చే సరికి పిల్లలు చనిపోయి కనిపించడంతో బాధితుడు బోరున విలపించాడు. మృతి చెందిన గొర్రె పిల్లల విలువ సుమారు రూ.3 లక్షల మేర ఉంటుందని వాపోయాడు.



మృతి చెందిన గొర్రె పిల్లలు

పిచ్చి కుక్కదాడిలో నలుగురికి గాయాలు

మండల పరిధిలోని కోర్నపల్లెలో శనివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన భారతమ్మ, ఓబులేసు, రామిరెడ్డితో పాటు మరొకరిపై దాడి చేయడంతో గాయపడ్డారు. వీధులో తిరుగుతూ ఒకరి తర్వాత ఒకరిని కరవడంతో గ్రామస్తులు భయంతో ఇళ్లలోకి వెళ్లారు. గాయపడిని వారిని చికిత్స కోసం కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పి.నరసింహయ్య (42) కర్నూలులో అదృశ్యమయ్యాడు. ఈయనకు మద్యం తాగే అలవాటు ఉండి అనారోగ్యంతో గత నెల 27వ తేదీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం భార్య సువర్ణ కర్నూలు అంతా గాలించినా కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 5.6 అడుగుల ఎత్తు ఉండి, చామన ఛాయ రంగు ఉంటాడు. అతను పారిపోయేటప్పుడు పసుపు, నీలం, ఎరుపు రంగు గల గీతల టీషర్టు, నల్లటి లుంగీ ధరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. చేతికి సాయిబాబా వెండి ఉంగరం, సింధూరం రంగు కాశీ తాడు చేతికి ధరించాడు. భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

డోన్ సీఐ బాధ్యతల స్వీకరణ

డోన్ టౌన్: డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇంతియాజ్ బాషా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో నంద్యాల ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో కర్నూలు నుంచి ఇంతియాజ్ బాషాను డోన్ సీఐగా నియమించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేయకుండా అడ్డుకుంటామని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వర్గీకరణకు వ్యతిరేకంగా దశలవారీగా ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై అమర్యాదకరంగా వ్యవహరించిన నంద్యాల సీఐ రాజారెడ్డిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాది, సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పులిదామోదర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సివిల్ కేసు విషయంలో సీఐ రాజారెడ్డి న్యాయవాది సుబ్బరామిరెడ్డి కాలర్ పట్టుకుని జీపులో ఎక్కించడం దారుణమన్నారు. సీఐ తీరుకు నిరసనగా సోమవారం ఆళ్లగడ్డ బార్ కౌన్సిల్ విధులు బహిష్కరించి ఎస్పీని కలిసి చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు తరలిరావాలని కోరారు.

నేడు బ్రాహ్మణ సంఘం సమావేశం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గాయత్రీ పీఠంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కల్లె శేషావలిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షురాలు ఏసీ కస్తూరిమూర్తి గత ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు ఇచ్చిన ఇంటి స్థలాల కోసం చందాల పేరుతో వసూళ్లకు పాల్పడిన విషయంపై చర్చించి భవిష్యత్ ప్రణాళికపై తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరువుకట్ట వద్ద ఫీడర్ మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. ఏఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దిరాల పెద్దతిరుపాల్ భూసార పరీక్షల కోసం మట్టిని సేకరించడానికి పొలం వద్దకు వెళ్లాడు. ఇతని పొలం పక్కనే బందేరు శ్రీరాములు పొలం ఉంది. తన పొలాన్ని ఎందుకు అక్రమించుకుంటున్నావని పెద్దతిరుపాల్ శ్రీరాములుని అడిగాడు. శ్రీరాములు, సంగీత్, వెంకటేశ్వర్లు కలిసి పెద్దతిరుపాల్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

● మారని వ్యాపారుల తీరు



కూరగాయల మార్కెట్‌లో రహదారిపై అడ్డంగా ఉంచిన గంపలు

డోన్ టౌన్: పాత బస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల దోరణి మారడం లేదు. వారికి కేటాయించిన స్థలాలు (కట్టలు)కాకుండా ప్రజలు తిరిగేందుకు వదిలిన ఖాళీ స్థలాల్లో గంపలు ఉంచడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చే మహిళలు ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లో ఎదురుగా వస్తున్న వారికి దారి ఇవ్వలేక అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అధికారులు తనిఖీ నిర్వహించిన ఒకటి రెండు రోజులు నిబంధనల ప్రకారం నడుచుకుంటూ షరా మామూలే అన్న రీతిలో వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండాలన్న ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాతబస్టాండ్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్‌ను తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట నమూన తరహాలో ఆధునిక హంగులతో నిర్మించింది. అయితే వ్యాపారుల తీరుతో మార్కెట్ పరిస్థితిలో ఏం ప్రయోజనం లేదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తెల్లదోమ ఆశించిన మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో సాగు చేసిన మినుము పంటను తెల్లదోమ, ఇతర రసం పీల్చే పురుగులు ఆశించడంతో శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తెల్లదోమ ఉధృతి కారణంగా పల్లాకు తెగులు విస్తరించి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే ఆస్కారం ఉందన్నారు. తెల్లదోమ, రసం పీల్చే పురుగుల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము అసిఫేట్ లేదా 0.2 గ్రాముల అసిటామిప్రిడ్ మందును పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- టీడీపీ నేతల దాడిలో గాయపడిన కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

బనగానపల్లె రూరల్: టీడీపీ మూక దాడిలో గాయపడిన కొలిమిగుండ్ల మండలం బెలుంశింగవరం గ్రామానికి చెందిన హరికృష్ణ, తిరుపతమ్మ దంపతులకు వైఎస్సార్‌సీపీ తరుపున మంజూరైన రూ.50 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ..బెలుం శింగవరం గ్రామంలో హరికృష్ణ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా ఉంటూ పార్టీ కోసం పని చేశారని, దీంతో టీడీపీ మూకలు ఎన్నికలు పూర్తయిన తరువాత హరికృష్ణ, తిరుపతమ్మ దంపతుల ఇంటి వద్దకు వెళ్లి విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కార్యకర్తలను అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.50 వేలు పార్టీ తరుపున మంజూరు చేయించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కంబయ్య పాల్గొన్నారు.



హరికృష్ణ, తిరుపతమ్మ దంతులకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

నంద్యాల జిల్లా పేరు మార్చే ప్రతిపాదన తగదు

కోవెలకుంట్ల: నంద్యాల జిల్లా పేరు మార్చే ప్రతిపాదన తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జిగాళ్ల లింగన్న అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. నవనందులు వెలసిన క్షేత్రంగా ఈ ప్రాంతం ప్రసిద్ధి కెక్కిందన్నారు. నంద్యాల నందవరం ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని నందన చక్రవర్తులు పాలించడం వల్ల నంద్యాలగా నామకరణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంతో చరిత్ర కలిగిన నంద్యాల పేరును బుడ్డా వెంగళరెడ్డి జిల్లాగా పేరు మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అవుకు చెరువుకు తిమ్మరాజు పేరు పెట్టాలని ప్రయత్నించగా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో విరమించుకున్నారన్నారు. అలాంటి పరిస్థితి నంద్యాల పేరు మార్పు విషయంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు వెంకటకృష్ణమూర్తి, వెంకట కుళాయి, మోహన్‌యాదవ్, లక్ష్మయ్య ఉన్నారు.

భూమిని కాజేశారు.. న్యాయం చేయండయ్యా



పత్రాలను చూపుతున్న బాధితులు

డోన్ టౌన్: పూర్వీకుల నుంచి వచ్చిన పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. తమకు న్యాయం చేయాలని ఉడుములపాడు గ్రామానికి చెందిన రైతులు కోళ్ల మాదయ్య, పాపన్నగారి లక్ష్మయ్య, కోళ్ల గోరంట్ల కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి విన్నవించారు. గ్రామంలో సర్వే నంబర్176-1లోని 5.26 ఎకరాల్లో 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. గత జూన్ 10వ తేదీ బనగానపల్లెకు చెందిన కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై బనగానపల్లె రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా (3742 నంబర్) రిజిస్ట్రేషన్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పేద విద్యార్థినికి రూ.84 వేల ఆర్థిక సాయం

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామానికి చెందిన ఎం.సుకన్యకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శనివారం రూ.84 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన వెంకట రమణ, నాగలక్ష్మి దంపతుల కూమార్తె ముక్కమల్ల సుకన్య ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. కొద్ది రోజుల క్రితం అనారోగ్యం చేయడంతో ఆస్పత్రిలో చూపించారు. లివర్ చెడిపోయిందని వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి నుంచి కర్నూలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విరాళాలను సేకరించి సుకన్య తల్లిదండ్రులకు అందజేశారు. లివర్ ఆపరేషన్ చేయడానికి సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారని.. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె తల్లిదండ్రులు వెంకట రమణ, నాగలక్ష్మి కోరుతున్నారు.

సంక్షిప్తం

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

కొలిమిగుండ్ల: విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. శనివారం కళాశాలలో ఎంఈఓ అబ్దుల్ కలాంతో కలిసి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పుస్తక పఠనం ద్వారా మంచి జ్ఞానం వస్తుందని సూచించారు. తల్లితండ్రుల కలలు నేరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుంటే భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకోవచ్చని పేర్కొన్నారు. లెక్చరర్లు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, బాల ఓబన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనంతో మానసిక ప్రశాంతత

బనగానపల్లె రూరల్: ఆధ్యాత్మిక జీవనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యనకండ్ల గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ఘనంగా ముగిశాయి. సర్పంచ్ గోవిందు, ఉప సర్పంచ్ బొబ్బలగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల సీఐగా రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా రమేష్‌బాబు నియమితులయ్యారు. శనివారం రాత్రి సీఐల బదిలీలు జరిగాయి. ఇక్కడ సీఐగా పని చేస్తున్న గోపీనాథ్‌రెడ్డికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆళ్లగడ్డలో సీఐ పని చేసిన రమేష్‌బాబును రెండు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో వీఆర్‌కు పంపారు. అక్కడి నుంచి కొలిమిగుండ్ల సీఐగా నియమించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ హయ్యద్‌బీ అనే క్యాన్సర్ బాధితుడికి వసుధ ఫౌండేషన్ సహకారంతో రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. శనివారం ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య బాధితుడికి నగదు అందజేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రంగాపురంలో పొలం బడి నిర్వహిస్తున్న ఏడీఏ, ఏఓ

బేతంచెర్ల: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఏఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు కాంతా రెడ్డి పొలంలో కొర్ర పంటపై పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఏఈఓలు మధు, రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ యశోద, భారతి, రైతులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరీదేవి జయంతోత్సవం

బేతంచెర్ల: ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం పట్టణ సమీపంలోని చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, సాయంత్రం రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, GANTE SUMITRA (Old Name), W/o, Ganta Rajesh, R/o. H.No: 7-7-2-4, Nehru Nagar, Near Vijaya Talkies, Dhone. Nandyal Dist, AP, India. Hence I State That My Name Has Been Changed As GANTA SUMITRA RAJESH (New Name).